# అందం

-సౌభాగ్య

వెన్నెల మల్లె పూలు కురిపిస్తోంది. ఎత్తుపల్లాల ఎగుడు దిగుళ్ల భూమి కూడా వెన్నెల్లో వెలిగిపోతోంది. ఆ నిశ్శబ్దంలో ఆనందం, దుఃఖం కరచాలనం చేసుకుంటున్నాయి.

వీధి మలుపులో ఆమె కుంటుతూ నడుస్తోంది. ఆమె అనాకారి అనలేం కానీ అందగత్తె అనికూడా అనలేం. ఎవరో తల్లి దానం చేసిన చీర కట్టుకుంది. ఎవరో పడేసిన జాకెట్ చిరుగుల్ని కట్టుకుని వేసుకుంది.

గురజాడ నాటకం కన్యాశుల్కంలో బుచ్చెమ్మలాగా ఈమెకూడా తలకు చమురు రాసుకోదు. ఆమె ఒకందుకు చమురు వున్నా తలకు రాసుకోదు. ఈమెకు చమురు లేక తలకు రాసుకోదు. నిజానికి ఈమెకు తల దువ్వుకోవడానికి దువ్వెన కూడా లేదు. కుళాయి నీళ్లనే తలకు రాసుకుని ముడేసుకుంటుంది.

ఆమెను ఎప్పుడో ఎవరో కనేసి ఎక్కడో పడేశారు. దిక్కులేని మొక్కలాగా పెరిగింది. దిక్కులేనివారికి దేవుడే దిక్కని అంటారు. కాని ఆమెను ఎప్పుడూ దేవుడు కూడా పట్టించుకున్నట్లు లేదు.

ఆకలి వేసినపుడు రెండు వీధుల్లో బిచ్చమెత్తుకుంటే అంత అన్నం దొరుకుతుంది. పూట గడిచిపోతుంది. ఆమె కాలు కుంటిది గనక ఆమె అనాకారి కాకపోయినా నడకలోని వక్రత వల్ల ఆమె ఆకారానికి వికారం తోడయింది.

ఈమధ్యనే ఆమెకు తోడు దొరికింది. లేదా దొరికాడు. అతన్ని రాముడు అని ఈమె అంటుంది. అతను ఈమెను సీత అంటాడు. రాముడు మాత్రం అందగాడు కాడు. కురూపి అనడానికి తగినన్ని లక్షణాలు అతనికున్నాయి. అతనికి ఒక కన్ను లేదు. చప్పిడి ముక్కు. కారునలుపు. చింపిరి జుట్టు. ఎప్పుడో అడుక్కునేటప్పుడు వీధిలో తారసపడ్డాడు. పలకరింతల్లో పరిచయం పెరిగింది.

అనాథలకు అనుబంధం పెరిగింది. సంబంధం కుదిరింది. ఆకాశమంత పందిరి కాకపోయినా ఆకాశమే పందిరిగా భూదేవే అరుగ్గా వాళ్లు ఒకటయ్యారు. అధికారికంగా కాకున్నా ప్రకృతి సాక్షిగా ఆమె అతనికి అర్ధాంగి అయింది.

మనసుల్తోపాటు అడుక్కొచ్చింది కూడా పంచుకుని కొంతకాలం అన్యోన్యంగానే గడిపారు.

క్రమంగా అతన్లో అసూయ పెరిగింది. తోటి బిచ్చగాళ్లతో సీత పలకరింపుగా మాట్లాడినా రాముడు భరించలేకపోయేవాడు.

సీతకు ఇది కొత్త అనుభవం. ప్రపంచంలో రాకున్నా కనీసం బిచ్చగాళ్ల సంఘంలోనైనా సోషలిజం వుందని నమ్మేది సీత.



రాముడు సీత అడుక్కుని దాచుకున్న డబ్బులు బలవంతంగా లాక్కునేవాడు. ఎదిరిస్తే కొట్టేవాడు. తన్నేవాడు. తాగివచ్చి స్పృహ తప్పేట్టు కొట్టేవాడు.

ఆ మురిక్కాలువ పక్కనే వేసుకున్న గుడిసెలో అప్పుడప్పుడూ నీరసంగా నిస్సహాయంగా దిక్కులు చూస్తూ గడిపేది సీత. ఆమె పెదాలపై నవ్వు ఎప్పుడూ పూయలేదు. అట్లా అని దుఃఖమూ లేదు. శూన్యానికి ఏదో అదనంగా శూన్యం వచ్చి చేరుతున్నట్లనిపించింది.

• • •

ఆ వెన్నెల్లో మలుపు తిరుగుతూ తన జీవితంలో రాబోతున్న మలుపును గూర్చి ఆలోచించింది సీత.

ఎట్లాంటి పర్యవసానం ఎదుర్కోడానికయినా సిద్ధపడింది. గుండె దిటవు చేసుకుంది. తన గుడిసెకు కొంత దూరంలో మూలుగుతూ పడుకున్న అతని దగ్గరకు వెళ్లింది. అతని పేరు గోవిందు. బిచ్చగాళ్లకు పేరు భగవంతుడే పెడతాడనుకుంటాను. గోవిందును బిచ్చగాళ్లు చూస్తే కూడా జడుసుకుంటారు. ఒక కాలు, ఒక చెయ్యి లేవు. గుబురు గడ్డం. అదనంగా అంటుకున్న కుష్టురోగం.

ఈమధ్యనే అతను పరిచయమయ్యాడు. అతన్లో ఆమెకు నచ్చిన లక్షణం సౌమ్యత, దౌర్జన్యానికి అలవాటుపడిన ఆమె అతనిలోని నెమ్మదికి ఆకర్షితురాలయింది. అప్పుడప్పుడూ తను బిచ్చమెత్తుకొచ్చినదాంట్లో కొంత అతనికి ఇచ్చేది. అతను కృతజ్ఞతగా చూసేవాడు. రాముడి నుండి క్రౌర్యాన్ని మాత్రమే ప్రతిఫలంగా పొందడం అలవాటయిన ఆమె గోవిందు కళ్లలో కృతజ్ఞత చూసి కరిగిపోయేది.

ఇక రాముడికి ఉద్వాసన చెప్పి గోవిందుతో సహజీవనం చెయ్యాలని గట్టి నిర్ణయానికి వచ్చింది. గోవిందును చేయి పట్టుకుని మెల్లగా నడిపించుకుని తన గుడిసెకేసి నడిచింది. రాముడు బాగా తాగి నిద్రకు ఉపక్రమించే స్థితిలో వున్నాడు. అలికిడి అయ్యేసరికి కళ్లు తెరిచి చూశాడు. నిర్భయంగా సీత గోవిందుతోబాటు గుడిసెలో అడుగుపెట్టింది.

రాముడికి చిర్రెత్తింది.

"ఎవడే వీడు. ఎందుకు వీణ్ణి ఇక్కడికి తీసుకొచ్చావ్?" అన్నాడు.

"ఇకనుంచీ గోవిందు ఇక్కడే వుంటాడు. ఇది నా గుడిసె. నువ్వు ఇష్టమొచ్చినట్లు అంటే నేను పడను. ఇష్టం లేకపోతే నువ్వు బయటికి నడువ్!" ధైర్యంగా అంది సీత.

రాముడికి సగం మత్తు దిగిపోయింది.

"ఒసే లం... ఈ కుష్టురోగం గాణ్ణి ఇంత వికారంగా వున్నవాణ్ణి మోజుపడి తీసుకొచ్చావా? నాలో లేంది వీడిలో నీకు ఏం కనిపించింది?" ఉక్రోషంగా అన్నాడు రాముడు.

సీత ఏమీ మాట్లాడలేదు.

గోవిందు మౌన ప్రేక్షకుడిలా చూస్తున్నాడు.

"మర్యాదగా ఈ దొంగనా కొడుకును బయటికి పంపుతావా? తన్నమంటావా?" అంటూ లేచి కాలు ఎత్తాడు రాముడు.

ఊతంగా భుజాల కింద పెట్టుకున్న కర్రతో గోవిందు విసురుగా రాముడి కాలు మీద కొట్టాడు. రాముడికి పూర్తిగా మత్తు దిగిపోయింది.

కాలు భరింపరాని నొప్పి పెట్టింది.

గోవిందుకేసి చూశాడు. గోవిందు కళ్లలో నిప్పులు చిమ్ముతున్నాయి.

చంపేస్తాడేమో అన్న భయంతో గుడిసెలోంచీ బయటికి గెంతి పారిపోయాడు రాముడు.

గోవిందుకేసి సంతోషంగా చూసింది సీత.

గోవిందు నిర్మలంగా మౌనంగా సీతకేసి చూశాడు.

పారిపోతూ పారిపోతూ "వాడిలో ఏం చూశావే లం..." అని అరిచాడు రాముడు.

తను గోవిందులో ఏ అందం చూసిందో చెప్పడానికి వీలుపడక గోవిందు కళ్లలో వెతుకుతూ వుండిపోయింది సీత.

★